మినీ గోకులాలు.. బిల్లులపై సందేహాలు

- పశువుల షెడ్లకు 90 శాతం
- గొర్రెలు, మేకలకు, కోళ్లకు 70 శాతం సబ్సిడీ



మినీ గోకులం పశువుల షెడ్డు

రాజుపాళెం : పశువులు ఉన్న పాడి రైతులు షెడ్లు నిర్మించుకోవడానికి గోకులాల పేరుతో గత టీడీపీ ప్రభుత్వ (2014–19) హయాంలో పథకం తీసుకొచ్చింది. పశువుల షెడ్లకు 10 శాతం, గొర్రెలు, మేకలకు 30 శాతం, కోళ్లకు 30 శాతం వాటా రైతులు చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన వాటా ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం రాయితీ చెల్లిస్తుంది. అయితే గతంలో గోకులాలు మంజూరైన వారంతా నిర్మాణం పూర్తయిన కొంతమందికి బిల్లులు రాక పోవడంతో ఆందోళన చెందారు. ఇక రావని తెలిసి చేసేదేమిలేక మిన్నకుండి పోయారు. అయితే తిరిగి ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి వచ్చాక మళ్లీ మినీ గోకులాలు అంటూ టీడీపీ ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. అయితే ప్రస్తుతం బిల్లులు సకాలంలో వస్తాయో, రావోనని వీటిని నిర్మించుకునేందుకు రైతులు ముందుకు రావడం లేదు.

షెడ్ల నిర్మాణాలకు రాయితీ

ప్రొద్దుటూరు నియోజకవర్గానికి 50 మినీ గోకులాలు మంజూరయ్యాయి. మండలానికి 25 షెడ్ల చొప్పున టార్గెట్ ఇచ్చారు. వాటి నిర్మాణానికి ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు తప్పనిసరి చేయగా, గ్రామ సభ ఆమోదం తీసుకోవాల్సి ఉంది. పశువుల షెడ్లకు 90 శాతం, మేకలు, గొర్రెలు, కోళ్ల షెడ్లకు 70 శాతం ప్రభుత్వం నుంచి రాయితీ అందుతుంది. షెడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి యజమానుల ఖాతాకు రాయితీ బదిలీ చేస్తారు.

బిల్లులు సకాలంలో వస్తేనే..

అయితే మినీ గోకులాలు దరఖాస్తు చేసుకున్న వారంతా బిల్లులు సకాలంలో వస్తేనే నిర్మాణాలను ప్రారంభిస్తామని, లేకుంటే చేయమని చెబుతున్నారు. గతంలో మాదిరిగా కట్టుకోండి ఇస్తామని అధికారులు చెప్పడంతో వస్తాయని వెంటనే నిర్మాణాలను పూర్తిచేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ బిల్లులు రాకపోవడంతో ఏంచేయలేని స్థితిలో ఉండిపోయారు. ఇప్పుడైన బిల్లులు వస్తే నిర్మాణాలను ప్రారంభిస్తామని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తేల్చి చెబుతున్నారు. అయితే దరఖాస్తులు కూడా అరకొరగానే వచ్చాయని ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు.

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మంజూరైన మినీ గోకులాలు

మండలం	యూనిట్లు
ప్రొద్దుటూరు	25
రాజుపాళెం	25
మొత్తం	50

ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా గోకులాల నిర్మాణాలు



ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పశువుల షెడ్ల నిర్మాణానికి రైతులను ఎంపిక చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. వాటి కోసం దరఖాస్తు చేసుకున్న పత్రాలను పశుసంవర్ధక శాఖ ఏడీ, ఎంపీడీఓ, ఏపీఓ, పశువుల డాక్టర్లు పరిశీలించి ఉన్నతాధికారులకు పంపించాం. పశువులకు పది శాతం, గొర్రెలు, మేకలకు 30 శాతం, కోళ్లకు 30 శాతం వాటా చెల్లించాలి. గోకులాలు మంజూరైన ఉత్తర్వులు వచ్చిన వెంటనే పది శాతం డీడీ చెల్లించి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఆకుల వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, పెద్దముడియం, రాజుపాళెం

నేడు మండల సమావేశం

రాజుపాళెం : రాజుపాళెంలోని ఎంపీడీఓ సభా భవనంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన తెలిపారు.

నేడు, రేపు శిక్షణ తరగతులు

ప్రొద్దుటూరు : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఉప సర్పంచ్‌లతోపాటు ఇద్దరు వార్డు మెంబర్లకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సానేపల్లి సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్ర, శనివారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంపీడీఓ కార్యాలయంలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

నేటి నుంచి ఎంటీఎస్ కార్యక్రమం

బి.కోడూరు : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి 19వ తేదీ వరకు జరగబోయే ఎంటీఎస్ కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు మెంబర్లు (ఒక పురుషుడు, ఒక స్త్రీ) తప్పక హాజరు కావాలని, హాజరయ్యేలా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా చండీ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో గురువారం పౌర్ణమి పర్వదిన సందర్భంగా ఘనంగా చండీ హోమాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకళ్యాణార్థం గోపూజ, గణపతి, నవగ్రహ, ఉప దేవతా హోమం, చండీ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు ఆలయ కమిటీ సభ్యులు, వేదపాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరశర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చట్టంపై అవగాహన ఉండాలి

బి.కోడూరు : సమాచార హక్కు చట్టం 2005పై మండల స్థాయిలో మండల కేంద్రమైన బి.కోడూరు వ్యవసాయ కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కౌశిక మాట్లాడుతూ సమాచార హక్కు చట్టానికి లోబడి దరఖాస్తుదారుడు అడిగిన సమాచారాన్ని ఏ విధంగా ఎన్ని రోజులలో అందించాలని, సమాచార హక్కు చట్టం గురించి పూర్తి వివరాలను అధికారులకు వివరించారు. ప్రజలు ఈ చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల నుండి వారికి కావాల్సిన సమాచారం పొందవచ్చన్నారు. సమాచారం రానప్పుడు లేదా ఇచ్చిన సమాచారంతో దరఖాస్తుదారుడు సంతృప్తి చెందనప్పుడు ఉన్నతాధికారులకు అప్పీలు చేసుకునే అవకాశం ఉందని ఆమె వివరించారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జిలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయుల వర్ధంతి

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని శ్రీ కృష్ణదేవరాయుల అన్నదాన సత్రంలో గురువారం శ్రీ కృష్ణదేవరాయుల వర్ధంతిని సత్రం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదేవరాయుల చిత్ర పటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం కార్యదర్శి, రచయిత బొల్లు రామ్మోహన్, అన్నదాన సత్రం అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి బొల్లు సిద్దయ్య, ఆకుల కొండయ్య, ధరిమిశెట్టి రమణయ్య, కొత్త బస్వాపురం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఫ్రీడమ్ బైక్ లాంచ్



ఫ్రీడమ్ బైక్ లాంచ్ చేస్తున్న ఎస్‌ఐ కొండారెడ్డి

పోరుమామిళ్ల : పట్టణంలోని ఆర్‌కే మోటార్స్ షోరూమ్‌లో గురువారం ఎస్‌ఐ కొండారెడ్డి ఫ్రీడమ్ బైక్‌ను లాంచ్ చేశారు. అలానే మొదటి కొనుగోలుదారునికి బండి తాళాలు అందజేశారు. ఆర్‌కే మోటార్స్ ఎండీ రవీంద్ర మాట్లాడుతూ ఈ బైక్ గ్యాస్, పెట్రోలు వేరియంట్‌లలో వచ్చిందన్నారు. గ్యాస్‌తో 100 కిలోమీటర్లు, పెట్రోలుతో 60 కిలోమీటర్లు మైలేజీ వస్తుందన్నారు. సీటు చాలా పొడవుగా ఉన్నందున నలుగురు కూర్చొని ప్రయాణం చేయవచ్చన్నారు. దూరప్రయాణం చేసేవారికి, మధ్యతరగతి కుటుంబాలకు, మార్కెటింగ్ ఉద్యోగులకు అనువుగా ఉంటుందన్నారు.

నేడు, రేపు శిక్షణ తరగతులు

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్ర, శనివారాల్లో ప్రజాప్రతినిధులకు శిక్షణతరగతులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రామానుజం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతులకు అన్ని పంచాయతీలలోని ఉప సర్పంచ్‌లు, పంచాయతీలోని ఒక పురుషుడు, ఒక మహిళ వార్డు సభ్యులు హాజరుకావాలని కోరారు.

కరెంట్ తీగలపై పడ్డ చెట్టు



విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది

పోరుమామిళ్ల : మండల కేంద్రంలోని బెస్తవీధిలో స్టార్ స్కూల్ పక్కన వేపచెట్టు విద్యుత్ లైన్‌పై వాలింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా చెట్టు లైన్‌పై పడటంతో తీగలు తెగి ఆ వీధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న ఏఈఈ వెంకట మహేష్ గురువారం లైన్‌మెన్ రాజా, సిబ్బందితో కలసి 3 గంటలు శ్రమించి, లైన్ సరిచేసి, విద్యుత్ పునరుద్ధరించారు. విద్యుత్ సిబ్బంది త్వరితగతిన స్పందించడంతో ఇబ్బంది తొలగిందని వీధి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

భక్తులకు అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలో గురువారం పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయస్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీ పాదవల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో 400 మందికిపైగా భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోండి



డ్రైనేజీలపై ఉంచిన బోర్డులను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని డ్రైనేజీలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలు, వ్యాపార ప్రకటనలతో కూడిన బోర్డులను సంబంధిత యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మైదుకూరు రోడ్డులో డ్రైనేజీలపై ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ కాలువలపై అక్రమ నిర్మాణాలు, బోర్డులను ఉంచడం ద్వారా పూడికతీత పనులకు ఆటంకం కలగడంతోపాటు ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తక్షణమే వాటిని తొలగించాలని కోరారు. నిర్దేశించిన గడువులోపు తొలగించకుంటే సదరు నిర్మాణాలను, బోర్డులను మున్సిపల్ సిబ్బందితో తొలగింపజేస్తామని హెచ్చరించారు.

కుక్కల తరలింపు

పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలను తరలించేందుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. పుల్లంపేటకు చెందిన సహదేవ అనిమల్ వెల్ఫేర్ సొసైటీకి వర్క్ ఆర్డర్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కుక్కలకు స్టెరిలైజేషన్, వ్యాక్సినైజేషన్ చేయించడం జరుగుతుందని చెప్పారు. పట్టణ పరిధిలో 475 కుక్కలను గుర్తించగా తొలిరోజు 35 కుక్కలను స్టెరిలైజేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళికాధికారి సతీష్, శానిటేషన్ సెక్రటరీ, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు తాపించాలి



రాజుపాళెంలో గొర్రెలకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

రాజుపాళెం : గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించాలని రాజుపాళెం, పెద్దముడియం మండలాల పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆకుల వెంకటేశ్వర్లు తెలిపారు. రాజుపాళెంలోని జీవాలకు గురువారం ఏడీ వెంకటేశ్వర్లు మందును తాపించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం 16వ తేదీ నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా 13236 జీవాలు ఉన్నాయన్నారు. దీని వల్ల పెరుగుదల బాగుంటుందని, మలబద్ధకం లేకుండా వెంట్రుకలు రాలకుండా ఉంటుందన్నారు. ప్రతి గొర్రెలు, మేకల కాపరులంతా క్రమం తప్పకుండా తాపించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా తీసేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మ్యాగీ

చాపాడు : నాలుగు రోజులు ఎడ తెరిపి లేకుండా కురిసిన తుఫాను వర్షాల వలన పంట పొలాల్లో వర్షపు నీరు అధికంగా చేరి ఉంటుందని ఈ నీటిని నిల్వ లేకుండా బయటికి తీసేయాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ అన్నారు. మండలంలోని పెద్దగురువళూరు, రామచంద్ర నగర్ గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది గ్రామ సభల్లో ఏఓ మాట్లాడుతూ పొలాలకు మోతాదుకు మించి ఎరువులు వేయవద్దని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకూ తెగుళ్లకు పురుగుల మందులు పిచికారీ చేయాలన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో ఉండే వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు తీసుకుంటే వ్యవసాయంలో మెళకువలు తెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ కార్యక్రమంలో జెడ్పీటీసీ జయరామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని దిరసవంచ పచాయతీలోని పెద్దిరాజుపల్లె, బీసీ కాలనీ, ఎస్సీకాలనీ, పాఠశాలకు కాంపౌండ్, నాగిశెట్టిపల్లె, బోడపాడు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఏపీఓ కృష్ణా, ఈఓపీఆర్డీ రంగయ్య, పాల్గొన్నారు.

గోపవరం : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని టి.సండ్రపల్లె గ్రామ పంచాయతీ రామిరెడ్డిపాలెం ఎస్టీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి జెడ్పీటీసీ జయరామిరెడ్డి భూమిపూజ చేశారు. రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, రూ.2.30 లక్షలో మినీ గోకులాలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ హసీనా, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బి.కోడూరు : కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పరుస్తామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జా రోశన్న తెలిపారు. గురువారం మండలంలోని ఐత్రంపేట గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రూ.29 లక్షల ఉపాధి హామీ నిధులకు సంబంధించి మంజూరైన సీసీ రోడ్డు పనులకు భూమిపూజ నిర్వహించారు. ఎంపీడీఓ భాస్కర్‌రావు, తహసీల్దారు మధునాయక్, పీఆర్ ఏఈ నారాయణరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ ఖాజా, ఏపీఎం సీ తారామిరెడ్డి, సర్పంచ్ పవన్, తదితరులు పాల్గొన్నారు.

చాపాడు : మండలంలోని మడూరు, అన్నవరం, అయ్యవారిపల్లె, టీఓపల్లె, ఎన్.ఓబాయపల్లె, రాజువారిపేట గ్రామాలలో సిమెంట్ రోడ్లు నిర్మించేందుకు గురువారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించినట్లు ఉపాధి హామీ పథకం ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఏపీఓ మాట్లాడుతూ మండలంలోని మడూరులో రూ.18.20లక్షలు, అయ్యవారిపల్లెలో రూ.11.6 లక్షలు, అన్నవరంలో రూ.8.50 లక్షలు, ఎన్.ఓబాయపల్లెలో రూ.8.50 లక్షలు, రాజువారిపేటలో రూ.4.10 లక్షలు, టీఓపల్లెలో రూ.3 లక్షలతో సిమెంట్ రోడ్లకు భూమిపూజ నిర్వహించారు. ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వ్యాపారులు చెత్త సేకరణకు సహకరించాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : పట్టణంలో కమర్షియల్ షాపులలో చెత్త సేకరణకు వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. గురువారం స్థానిక గాంధీ రోడ్డు, మైదుకూరు రోడ్డులో వాణిజ్య షాపుల యజమానులతో కమిషనర్ మాట్లాడారు. రోజు సాయంత్రం 6 గంటల నుంచి చెత్త సేకరణ ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. షాపుల నుంచి చెత్త సేకరణకు యజమానులు సహకరించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

ప్రొద్దుటూరు : ఆది కవి వాల్మీకి మహర్షి జయంతిని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి స్వగృహంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలామల వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ రామాయణం రచించిన ఆదికవి వాల్మీకి మహర్షి అని అన్నారు. ఆయన రామాయణ కావ్యం ద్వారా ఆదర్శ మానవుడు ఎలా ఉండాలి, భార్యా భర్తల మధ్య, తండ్రి కొడుకుల మధ్య, అన్నదమ్ముల మధ్య, ప్రభువు సేవకుల మధ్య అనుబంధాలు ఎలా ఉండాలో వివరించారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, గోపల్లె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి మాజీ డైరెక్టర్ ఉప్పర మురళి, జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం ఆదర్శప్రాయం

బద్వేలు అర్బన్ : వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయమని మహనీయుల ఆశయసాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు బి.గురుమూర్తి పేర్కొన్నారు.



వాల్మీకి మహర్షి జయంతి వేడుకలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం స్థానిక సృజన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీరాముని దివ్యచరితను, రామనామ మాధుర్యాన్ని మనకు అందించిన మహర్షి వాల్మీకి చిరస్మరణీయులని అన్నారు. బద్వేలు పట్టణంలో వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని కోరారు. తొలుత వాల్మీకి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బాల గురన్న, స్కూల్ కరస్పాండెంట్ పాలేటి శ్రీనివాసుల రెడ్డి, ఆర్యవైశ్య నాయకుడు కె.వి.సుబ్బారావు, ఆవాజ్, పూలే ఆశయసాధన సమితి సభ్యులు అఫ్రిద్, రామ్మోహన్, మునిస్వామి పాల్గొన్నారు.



బద్వేలు అర్బన్: వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అట్లూరు: గ్రంథాలయంలో వాల్మీకి మహర్షి వేడుకలు

అట్లూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పాఠకులు, గ్రామస్తులతో గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన గొప్పతనాన్ని వివరించారు.

స్టేట్ బ్యాంక్ వద్ద మద్యం దుకాణం

కలసపాడు : కూటమి ప్రభుత్వం ఇటీవల నూతన మద్యం పాలసీని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా కూటమి నాయకులు మద్యం టెండర్లలో మద్యంషాపును దక్కించుకున్నారు. మద్యం పును స్థానిక స్టేట్‌బ్యాంక్ ఎదురుగా ఏర్పాటు చేశారు. దీంతో మందుబాబులతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. మద్యంషాపును స్టేట్‌బ్యాంకు వద్ద లేకుండా గ్రామశివారులో ఏర్పాటు చేయాలని మహిళలు కోరుతున్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

చాపాడు : మండల వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాల పరిధిలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు రమాకుమారి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న ఈ సదస్సులు 18న వెంగన్నగారిపల్లె (అన్నవరం సచివాలయం), 19, 22న బద్రిపల్లెలో 23, 24న చాపాడు, 25న తుమ్మలపాడు, 26, 29న అల్లాడుపల్లె, 30న పెద్దగురువళూరు, నవంబర్ 1న చిన్నగురువళూరు, 2న బూడిదపాడు, 5, 6, 7 తేదీలలో అనంతపురం, 8, 12న కుచ్చుపాప, 13, 14న వెదురూరు గ్రామాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వరిపంట పరిశీలన

బి.కోడూరు : మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న వరిపంటను గురువారం వ్యవసాయాధికారి కౌశిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులనుద్దేశించి మాట్లాడారు. మండలంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా వరిపొలంలో నీరు నిలిచి గాలిలో తేమ శాతం పెరగడం వలన చీడపీడల ఉధృతి పెరుగుతుందన్నారు. సకాలంలో రైతులు పంటను పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే పంట నష్టం జరుగుతుందని తెలిపారు. అలాగే మండలంలో సాగుచేసిన మొక్కజొన్న, కంది తదితర పంటలను పరిశీలించారు. పొలంలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని తెలిపారు. వరి పంట నేలవాలి ఉంటే కుదుళ్లను నిలబెట్టి గుంపులుగా కట్టాలని, గింజలు మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉండేందుకు ఒక లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పును కలిపి పిచికారీ చేయాలన్నారు.

సమాచారం ఇవ్వాల్సిందే

మైదుకూరు : సమాచార హక్కు చట్టం -2005 ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా శాఖల అధికారులు, సంస్థలు సమాచారం ఇవ్వాల్సిందేనని మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. గురువారం మైదుకూరులో సమాచార హక్కు చట్టంపై రైతులకు, వ్యవసాయ సహాయకులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ సెక్షన్ 6, 7/1 ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజులలోపు పూర్తి సమాచారం ఇవ్వాల్సిందేనన్నారు. సెక్షన్ 4/1/ఏ ప్రకారం ప్రతి కార్యాలయం ఆవరణలో సమాచార అధికారి, సహాయ అధికారి, అప్పిలేట్ అధికారి పేర్లను, హోదాలను, ఫోన్ నంబర్లను కనపరుస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. సెక్షన్ 19/1 ప్రకారం సమాచారం కోసం పైఅధికారులకు అప్పీలు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ విషయాలపై అవగాహన పెంచుకుని అవసరమైన సమాచారం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

నరకానికి నకలుగా అమరావతి రోడ్డు



గుంతలమయమైన అమరావతి రోడ్డును చూపుతున్న సీపీఐ నాయకులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల నుండి అమరావతికి వెళ్లే దారి నరకానికి నకలుగా మారిందని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ ఆరోపించారు. గురువారం సీపీఐ నాయకులు పోరుమామిళ్ల నుండి జిల్లా సరిహద్దు వరకు రోడ్డును పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ పోరుమామిళ్ల నుండి జిల్లా సరిహద్దు వరకు రోడ్డు గుంతలు పడి కుంటలను తలపిస్తున్నాయన్నారు. ఈ రోడ్డుపై వాహనాలు ప్రయాణించడమంటే నరకానికి వెళ్లే దారి కూడా ఇలా ఉండదేమోనని ఎద్దేవా చేశారు. చాలాకాలంగా గుంతలు పడిన ఈరోడ్డును పట్టించుకోక పోవడం వల్ల ఇటీవల వానలతో భయంకరంగా తయారయ్యాయన్నారు. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు శ్రీశైలం, విజయవాడ, ఒంగోలు, కాకినాడ, నాగార్జునసాగర్, విశాఖపట్నం తదితర పట్టణాలకు వెళుతుంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, రోడ్డు భవనాలశాఖ ఉన్నత అధికారులు వెంటనే స్పందించి నిధులు కేటాయించి రోడ్డు బాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సునీల్‌కుమార్, కేశవ, చెన్నయ్య, పాల్గొన్నారు.

రాజోలి ఆనకట్టకు జలకళ



రాజుపాళెం: రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి పోతున్న వర్షం నీరు

రాజుపాళెం : కర్నూలు, నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు మండల పరిధిలోని రాజోలి ఆనకట్టకు భారీగా వచ్చి చేరుతోంది. మంగళవారం రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 10020 క్యూసెక్కులు నీరు పోతుండగా గురువారం 14101 క్యూసెక్కులు, కేసీ ప్రధాన కాలువకు 445, కేసీ చాపాడు కాలువకు 65 క్యూసెక్కుల నీరు పోతున్నట్లు కేసీ కెనాల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం రాజోలి ఆనకట్ట వద్ద జళకళగా సంతరించుకుంది. దీంతో పాత వంతెనపై తాకుతూ వరద నీరు పోతోంది. కుందూనది పరిధిలోని గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.



రాజుపాళెం: వెల్లాల పాత వంతెనను తాకుతూ పోతున్న వర్షం నీరు

బండి విజయభాస్కర్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటు



బండి విజయభాస్కర్‌రెడ్డి సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాచమల్లు

ప్రొద్దుటూరు : మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి విజయభాస్కర్‌రెడ్డి మరణం తీరని లోటని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. విజయభాస్కర్‌రెడ్డి పెద్ద కర్మ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం పెద్దశెట్టిపల్లె గ్రామంలోని బండి విజయభాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం సమాధి వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా బండి విజయభాస్కర్‌రెడ్డి నిబద్ధతతో గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసి అందరి హృదయాలను గెలుచుకున్నారన్నారు. ఆయన కుటుంబానికి జగనన్న అండగా ఉంటారన్నారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ బండి విజయభాస్కర్‌రెడ్డి అకాల మరణంతో నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నష్టపోయిందన్నారు. గత 40 ఏళ్లుగా నియోజకవర్గంలో ఆయన టీడీపీ కోసం పనిచేసినా ఆయన స్థాయికి తగిన విధంగా ఆ పార్టీ గుర్తింపు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో బండి విజయభాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు బండి సరస్వతి, సానా రెడ్డి, బాలసుబ్బారెడ్డి, కుమారస్వామి రెడ్డితోపాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బండాత్మకూరు సుధాకర్‌రెడ్డి, కొత్తపేట రాజారెడ్డి, పల్లా లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి, బోడెల మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, శంకరాపురం నాగమునిరెడ్డి, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.